ఉపాధికి తీరిన చింత

- మడకశిర నియోజకవర్గంలో అధిక సంఖ్యలో చింత చెట్లు
- నాలుగు నెలల పాటు చింత పండు సీజన్
- స్థానికంగానే కూలీలకు ఉపాధి
- జీవనోపాధికి ఇబ్బంది లేదంటున్న కూలీలు

మడకశిర రూరల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ విస్తరించి ఉన్న చింత చెట్లు స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నాయి. చింత చెట్ల సాగుతో రైతులు ఆర్థికంగా ఎదగడమే కాకుండా కూలీలు సైతం ఉపాధి పొందుతున్నారు. ప్రతి ఏడాది వేరుశనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులను చింత ఎంతో కొంత ఆదుకుంటోంది.

2 లక్షల చింత చెట్లు

మడకశిర నియోజకవర్గంలో దాదాపుగా 2 లక్షల చింత చెట్లు ఉన్నాయి. ప్రతి ఏడాది చింత పండు సీజన్ జనవరి నెలలో ప్రారంభమై ఏప్రిల్ చివరి వరకూ ఉంటుంది. దాదాపు 4 నెలల పాటు సీజన్ ఉండడంతో దాదాపు 20 వేల కుటుంబాల కూలీలకు వరంగా మారింది. చాలా మంది కూలి పనులపైనే ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. జనవరి నుంచి ఏప్రిల్ వరకు చింత చెట్లు కూలీల ఉపాధికి భరోసారి కల్పిస్తున్నాయి. చింత చెట్లలోని చింతకాయలను కోయడం నుంచి చింత పండును శుద్ధి చేయడం వరకు కూలీలు ఉపాధి పొందుతున్నారు.

మగవారికి రూ.800.. ఆడవారికి రూ.300

చింత చెట్లలోని చింత కాయలను కోయడానికి మగవారికి రోజుకు రూ.800 చెల్లిస్తున్నారు. అదేవిధంగా కోసిన చింతకాయలను ఏరడానికి ఆడవారికి రూ.300 వరకు చెల్లిస్తున్నారు. రోజూ కూలీలకు స్థానికంగానే ఉపాధి లభిస్తోంది. ప్రతి గ్రామంలో కూడా చింత చెట్లు ఉండటం కూలీలకు వరంగా మారింది. అదేవిధంగా చింత పండును శుద్ధి చేయడానికి కూడా కూలీల అవసరం ఎక్కువగా ఉంటుంది. రోజూ గ్రామాల్లో రైతులు చింత పండును శుద్ధి చేయాల్సి ఉంది. దీంతో ఆడకూలీల అవసరం ఎక్కువ. చింత పండును శుద్ధి చేయానికి రోజుకు ఆడవారికి రూ.300 చెల్లిస్తున్నారు. రోజూ వందలాది మంది చింత చెట్ల ద్వారానే ఉపాధి పొందుతున్నారు.



చింతపండు కొట్టడానికి ఎండబెట్టిన చింత కాయలు

జీవనానికి ఇబ్బంది లేదు



చింత పండు సీజన్ ప్రారంభం నుంచి 4 నెలల వరకు స్థానికంగా ఉపాధి దొరుకుతుంది. చింత కాయలను కొట్టడానికి వెళుతున్నాను. రోజూ రూ.300 కూలి ఇస్తున్నారు. చేసిన పనికి ఆలస్యం చేయకుండా కూలి చెల్లిస్తారు. ఏ ఇబ్బంది లేకుండా కుటుంబాన్ని పోషించుకోగలుగుతున్నాము.

– గంగమ్మ, గౌదనహళ్లి, మడకశిర మండలం

నాలుగు నెలల పాటు ఉపాధి



చింతపండు సీజన్ వచ్చిందింటే గ్రామంలోనే నాలుగు నెలలు పాటు ఉపాధికి ఏ ఇబ్బందిలేదు. చింతపండు సీజన్ ముగిసిన తర్వాత వ్యవసాయ పనులకు వెళ్లాల్సింటుంది. రోజుకి రూ.300 కూలి ఇస్తారు. చింతపండు సీజన్‌లో మా లాంటి పేదలకు స్థానికంగానే ఎంతగానో ఉపాధి దొరుకుతోంది.

– చౌదమ్మ, గౌదనహళ్లి, మడకశిర మండలం



చింత పండును శుద్ధి చేస్తున్న కూలీలు

పరిగిలో ఆర్డీఓ విస్తృత పర్యటన

పరిగి: ఆర్డీఓ ఆనంద్‌కుమార్ బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తహసీల్దార్ హసీనా సుల్తానాతో కలిసి తొలుత తహసీల్దారు కార్యాలయంలో సిబ్బందితో మండలంలో జరుగుతున్న రీసర్వే జరుగుతున్న తీరుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక ఎస్సీ, బీసీ హాస్టళ్లను తనిఖీ చేశారు. అక్కడి నుంచి పీహెచ్‌సీ తనిఖీ చేశారు. హొన్నంపల్లిలో ఎండీయూ వాహనాల్లో బియ్యం పంపిణీని పరిశీలించారు. అనంతరం కాలువపల్లి వద్ద ఉన్న విద్యానిధి జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

గాంధారి విద్యలో మెహతాబ్ ప్రతిభ

పావగడ: పట్టణంలోని శ్రీశాల పాఠశాల 5వ తరగతి విద్యార్థిని మెహతాబ్ గాంధారి విద్యలో ప్రావీణ్యం పొంది 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' లో చోటు చేసుకుంది. ఇటీవల బెంగళూరుకు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు మెహతాబ్ ప్రతిభను పరీక్షించారు. కళ్లకు గంతలు కట్టుకుని తన ఎదురుగా ఉంచిన రంగులు, అంకెలు, రూపాయి నోట్లను అవలీలగా గుర్తుపట్టింది. దీంతో ఆమె వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరును నమోదు చేసుకుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం చిన్నారిని ఘనంగా సన్మానించారు. గాంధారి విద్యలో శిక్షణ పొందిన బ్రైట్ ఫ్యూచర్ శిక్షణ కేంద్రం నిర్వాహకుడు శ్రీధర్ గుప్తా , శిక్షకురాలు మంగళూరు రూపశ్రీ తదితరులు హర్షం తెలిపారు.



మెహతాబ్‌ను అభినందిస్తున్న దృశ్యం

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు గోవిందప్ప

అమరాపురం: మండలంలోని కాచికుంట గ్రామానికి చెందిన గోవిందప్ప (47) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ఇషాక్‌బాషా వివరాల మేరకు .. 8 నెలల క్రితం గోవిందప్ప ఇంటి ముందు బైక్ నిలిపి ఉంచగా దుండగులు నిప్పుపెట్టారు. ఈ నేపథ్యంలో అతను అప్పుడప్పుడు తిట్టుకునేవాడు. ఎదురింట్లో నివాసం ఉంటున్న సుశీలమ్మ, రత్నమ్మ, గౌరమ్మలు తమనే తిట్టుతున్నాడనుకునే వారు. ఈ నేపథ్యంలోనే గోవిందప్పతో వారు గొడవపడేవారు. గోవిందప్ప తన భార్య గుండమ్మను తరచూ ఉపాధి నిమిత్తం బెంగళూరు పంపేవాడు. ఈ నేపథ్యంలో బతకడం కన్న చావడం మేలు ఎదురింట్లో ఉన్న మహిళలు ప్రేరేపించడంతో ఆ అవమానాన్ని భరించలేక ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గుండమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ ఉదయపావని

మడకశిర: విద్యార్థినులు ప్రతి అంశంపై అవగాహన పెంపొందించుకోవాలని ట్రైనీ డీఎస్పీ ఉదయపావని, సీఐ రాజ్‌కుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థినులు మంచి నడవడికతో మెలగాలని కోరారు. చదువులో రాణించి ఉన్నత స్థానానికి ఎదిగేందుకు ప్రయత్నించాలన్నారు.

కొంకల్లులో 'పొలం పిలుస్తోంది'

గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లు, మందలపల్లి గ్రామంలో ఏఓ వీరనరేష్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఏఓ వివరించారు. అనంతరం వరి, వేరుశనగ, రాగి పంట పొలాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలిచ్చారు.

బాలికలకు వక్తృత్వ పోటీలు

రొళ్ల: మండల పరిధిలోని ఆవినకుంట గ్రామ సమీపాన ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 'నేరాలు – నియంత్రణ' అనే అంశం మీద వక్తృత్వపు, చిత్రలేఖన పోటీలను నిర్వహించినట్లు ఆ పాఠశాల ఎస్ఓ, ప్రిన్సిపాల్ ఎస్.మున్వార్‌జాన్ తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు దిలీప్, వన్నప్ప, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

హిందూపురం అర్బన్: విద్యార్థులు, యువతులు కష్టపడే తత్వం అలవరుచుకొని ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని డీఎస్పీ కేవీ మహేష్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు మహిళా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ప్రగతి అధ్యక్షతన నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీడీపీఓ శాంతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ హరికృష్ణ , వైస్ ప్రిన్సిపాల్ వెంకటేసులు, సీఐ అబ్దుల్ కరీం, ఎస్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై సత్వరమే స్పందించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళా కానిస్టేబుళ్లు, వార్డు గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న సీడీపీఓ, డీఎస్పీ

పెండింగ్ బకాయిలు చెల్లించండి

పెనుకొండ: మధ్యంత భృతి ప్రకటించి ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఏపీఎస్టీఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంకటరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఏపీఎస్టీఏ పెనుకొండ మండల కార్యవర్గ సమావేశం విజయకుమార్ అధ్యక్షతన జరిగింది. నరేష్‌కుమార్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీ ఆలస్యం అవుతున్నందున ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు పేరుతో సమీప పాఠశాలలను విలీనం చేస్తూ ప్రాథమిక పాఠశాలలను రద్దు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సబ్జెక్టుల వారీగా పదోన్నతులు, సీనియార్టీ లిస్టులు ప్రకటించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు విజయకుమార్‌నాయక్, మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, బాబు, జిల్లా కౌన్సిలర్ శ్రీనివాసులు, రాజేష్‌నాయక్, వరప్రసాద్, శివరాజ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేష్‌కుమార్

రెండు ప్రాణాలు కాపాడిన 'డయల్ 100'

హిందూపురం అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఇద్దరి ప్రాణాలను డయల్ 100 కాపాడింది. వివరాలు... హిందూపురం శివారులోని సేవామందిర్‌కు చెందిన నాసీర్‌ఖాన్, రుబియా దంపతులు ముక్కిడిపేటలో ఉంటున్నారు. చిన్నపాటి విషయానికి దంపతులిద్దరూ మంగళవారం రాత్రి గొడవ పడ్డారు. ఆ సమయంలో క్షణికావేశానికి లోనైన నాసీర్‌ఖాన్, తన చిన్న కుమారుడు అయాన్‌ఖాన్‌ను వెంటబెట్టుకుని చనిపోతామంటూ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎంత సేపటికీ ఆయన తిరిగి రాకపోవడంతో భయపడిన రుబియా... విషయాన్ని వెంటనే డయల్ 100కు చేరవేసింది. దీంతో అప్రమత్తమైన ఎస్ఐ శ్రీధర్, ఏఎస్ఐ వెంకటరమణ, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, బ్లూకోల్ట్స్ పీసీ జగన్నాథ్ నాయక్‌తో పాటు పరిగి ఎస్ఐ రంగడు నాలుగు బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టారు. నాసీర్‌ఖాన్ సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై కూర్చొని ఉన్న విషయాన్ని గుర్తించి రాత్రి 11 గంటలకు అదుపులోకి తీసుకుని పీఎస్‌కు చేరుకున్నారు. కౌన్సెలింగ్ అనంతరం వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోలీస్ కానిస్టేబుల్ సస్పెన్షన్

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ భరత్ వడ్డీ వ్యాపారం నిర్వస్తున్నాడని విచారణలో తేలడంతో తుమకూరు జిల్లా ఎస్పీ కేవీ అశోక్... కానిస్టేబుల్ భరత్‌ను సస్పెండ్ చేశారు. బాలమ్మనహళ్లి తండాకు చెందిన చంద్రనాయక్‌కు రూ.40 వేలు వడ్డీకి ఇచ్చాడు. అయితే వడ్డీ వసూలు విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మధుగిరి డీఎస్పీ మంజునాథ్ నేతృత్వంలో విచారణ జరిగింది. వడ్డీ వ్యాపారం చేస్తున్నాడని తేలడంతో భరత్‌ను సస్పెండ్ చేసి టిపటూరు తాలూకా హొన్నవళి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

డిగ్రీ విద్యార్థులకు శిక్షణ

పెనుకొండ: 2021–24వ సంవత్సరంలో డిగ్రీ రెగ్యులర్‌గా పాసైన విద్యార్థులకు స్వయం ఉపాధి, జనరల్ నాలెడ్జ్ , ఇండస్ట్రీస్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం జాతీయ అప్రెంటీస్ శిక్షణ పథకం, ఆశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై సమావేశం నిర్వహించారు. శిక్షణతో పాటు రూ.3,500 స్టైఫండ్ ఇవ్వనున్నట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఆన్‌లైన్ శిక్షణ అనంతరం ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా విభాగం సీఓ సాధికాభాను, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సోలార్ ఉద్యోగిపై కత్తితో దాడి

పావగడ: తాలూకాలోని వడ్రేవు ఆర్ఎస్ఎస్ సోలార్ కంపెనీలో పనిచేస్తున్న అనిల్‌కుమార్‌పై అదే కంపెనీలో పనిచేస్తున్న గుజరాత్‌కు చెందిన ఉద్యోగి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రుడికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమణి పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. కాగా, దాడికి కారణాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్: ఆగి ఉన్న లారీని ఢీ కొనడంతో బుధవారం మండల పరిధిలోని మునిమడుగు గ్రామానికి చెందిన తిరుమలనాయుడు గాయపడ్డాడు. పెనుకొండ నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యలో సోలార్ పరిశ్రమ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ వెలుతురుకు ఆగి ఉన్న మరో లారీని ఢీ కొన్నాడు. క్షతగాత్రుడిని వెంటనే స్థానికులు అనంతపురం తరలించారు.

రామ్మోహన్‌రావుకు ఘన నివాళి

మడకశిర: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం ఎన్ఎంయూ వ్యవస్థాపకుడు పీవీ రామ్మోహన్‌రావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు చిత్రపటం వద్ద ఎన్ఎంయూ సభ్యులు నివాళులర్పించారు. నాయకులు రామకృష్ణ, అజీజ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోర్టు ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం



వాటర్ డిస్పెన్సరీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

పెనుకొండ: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో బుధవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాటర్ డిస్పెన్సరీ ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో కోర్టుకు వచ్చే కక్షిదారులు ఇబ్బంది పడకుండా తాగునీటి సౌకర్యం ఏర్పాటుకు శ్రీనివాసులుతో కొందరు న్యాయవాదుల సహకారంతో సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు ప్రాంగణంలో వాటర్ డిస్పెన్సరీ ఏర్పాటు చేశారు. సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్, జూనియర్ సివిల్ జడ్జిలు ముజీబ్ పసపల, బొజ్జప్ప చేతుల మీదుగా ప్రారంభించారు.

7న వారపు సంత వేలం పాట

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి క్రాస్ సమీపంలో నిర్వహించే వారపు సంత వేలం పాటను శుక్రవారం ఉదయం 10 గంటలకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి నర్సేగౌడ్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.2 వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ



పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమైన మంజువాణి

పరిగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్ఓం మంజువాణీ తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఓపీ, మందుల నిల్వల రికార్డు, హాజరు పట్టి, గర్భిణులు, బాలింతల, చిన్నారుల వివరాల రికార్డులు పరిశీలించారు. అనంతరం కాన్పు, చికిత్స వార్డులకు వెళ్లి వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్లు నవీన, స్వరూపరెడ్డి విన్నవించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వంద రోజుల పని కల్పించండి

రొళ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి ద్వారా ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఏపీడీ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

జీఓ 77ను రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న దృశ్యం

హిందూపురం: పీజీ విద్యార్థులకు శాపంగా మారిన కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం హిందూపురం తహసీల్దార్ వెంకటేసుకు వినతిపత్రాన్ని అందించారు. జీఓ నంబర్ 77 రద్దు చేసి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్‌తో యూనివర్సిటీ కేంద్రాల్లో విద్యార్థుల కొరతతో కొన్ని డిపార్ట్‌మెంట్లను మూసేయాల్సి వస్తుందన్నారు.

పొలానికి నిప్పు

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి గ్రామ సమీపంలో సంజీవరాయప్ప, నారాయణప్పకు చెందిన పొలానికి బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. మంటలను గమనించి అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే రైతు సంజీవరాయప్పకు చెందిన డ్రిప్ పరికరాలు, పలు చింత చెట్లు కాలిపోయి రూ.50 వేల వరకూ నష్టం జరిగిందన్నారు. అదే విధంగా రైతు నారాయణప్పకు చెందిన మామిడి చెట్ల కాలిపోయి రూ.70 వేల వరకూ నష్టం జరిగిందన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

సోమందేపల్లి: మండలంలోని పత్తికుంటపల్లిలో అప్పన్‌సా (52) అనే వ్యక్తి బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామ సమీపంలోని శ్మశాన వాటిక వద్ద అతని మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. కాగా, మంగళవారం రాత్రి అప్పన్‌సాకు మరో ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ



మహమ్మద్ సాద్‌ను పరామర్శిస్తున్న దీపిక

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని ఆజాద్ నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహమ్మద్ సాద్‌ను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక బుధవారం పరామర్శించారు. కొద్ది రోజులుగా సాద్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న దీపిక బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జ్ సహేరాభాను, రూరల్ మండల కన్వీనర్ రాము, వార్డు ఇన్‌చార్జ్‌లు షబ్బీర్, అయూబ్ బేగ్, ఆసిఫ్‌ఖాన్, నాయకులు శ్రీరాములు, బాబాజాన్, ఇనాయతుల్లా, ఇర్ఫాన్, షఫీవుల్లా, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

అమరాపురం: హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో దేవదాయ, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. ఆలయానికి రూ.9.26 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసింహరాజు తెలిపారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఇషాక్‌బాషా, అర్చకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నీలమ్మనహళ్లిలో చిరుత కలకలం



కొండపై కనిపిస్తున్న చిరుత

పావగడ: తాలూకాలోని నీలమ్మనహళ్లి గ్రామ కొండ గుట్టలో బుధవారం ఉదయం ఓ చిరుత కనిపించడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు లోనయ్యారు. గతంలో ఎన్నడూ ఈ ప్రాంతంలో చిరుత సంచారం లేదని, అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.